సాక్షి
అల్లూరి సీతారామరాజు జిల్లా

సోమవారం • 17 • ఫిబ్రవరి • 2025



న్యూస్‌రీల్

జిల్లాకు నీతిఆయోగ్ అవార్డు

– రూ.5 కోట్లు మంజూరు

సాక్షి,పాడేరు: నీతిఆయోగ్ దేశ వ్యాప్తంగా ఏడీపీ ర్యాంకింగ్స్‌ను ప్రకటించింది.అన్ని కేటగిరిలకు సంబంధించి అల్లూరి సీతారామరాజు జిల్లా 9వ ర్యాంక్ పొందింది. దీంతో రూ.5కోట్లను మంజూరు చేసింది.ఈ నిధులను జిల్లాలో అభివృద్ధి పనులకు వెచ్చించనున్నారు.జిల్లా అభివృద్ధికి కృషి చేస్తున్న కలెక్టర్ ఎ.ఎస్.దినేష్‌కుమార్‌ను నీతిఆయోగ్ ప్రత్యేకంగా అభినందించింది.

అరకు క్వెస్ట్‌లో విజేతలకు బహుమతుల ప్రదానం



విజేతలకు బహుమతులు అందజేస్తున్న కలెక్టర్ దినేష్‌కుమార్

పాడేరు: అరకు చలి ఉత్సవాల్లో భాగంగా నిర్వహించి ద గ్రేట్ అరకు క్వెస్ట్‌లో గెలుపొందిన వారికి కలెక్టర్ దినేష్‌కుమార్ ఆదివారం తన క్యాంప్ కార్యాలయంలో బహుమతులు అందజేశారు. మొదటి బహుమతి పొందిన ధృవ అండ్ టీంకు రూ.50వేలు, రెండో బహుమతి పొందిన మంగతల్లి అండ్ టీంకు రూ.30వేలు, మూడో బహుమతి పొందిన హెచ్.బి. భాస్కర్‌రెడ్డి అండ్ టీంకు రూ.20వేల నగదు అందజేశారు. బొర్రా గుహల నుంచి అరకు లోయ వరకు నిర్వహించిన సైకిల్ ర్యాలీలో పాల్గొన్న సుంకరమెట్ట పంచాయతీ గుమ్మకోట గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలలో ఆరో తరగతి చదువుతున్న పెట్టెలి అజయ్ అనే విద్యార్థికి సైకిల్, కిట్‌ను అందజేస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ట్రైబల్ మ్యూజియం క్యూరేటర్ మురళి పాల్గొన్నారు.

'బిడ్డకు జన్మనిచ్చిన బాలిక '

హుకుంపేట: స్థానిక ప్రభుత్వ కళాశాలకు చెందిన ఓ బాలిక బిడ్డకు జన్మనిచ్చినట్లు గిరిజన సంఘం అనుబంధ ఐద్వా జిల్లా కార్యదర్శి సొంటేన హైమావతి ఆదివారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. మండలంలోని భూర్జా పంచాయతీ కొడయ్యపాడు గ్రామానికి చెందిన గిరిజన బాలిక ఇటీవల విశాఖ కేజీహెచ్‌లో ఓ బిడ్డకు జన్మనిచ్చిందని, ఆ బాలిక స్థానిక ప్రభుత్వ కళాశాలలో చదువుతూ, గిరిజన సంక్షేమ శాఖ హాస్టల్లో ఉండేదని తెలిపారు. ఈ ఘటనపై హాస్టల్ వార్డెన్ కన్యాకుమారిని వివరణ అడగగా నెల రోజులు మాత్రమే హాస్టల్లో ఉండి, ఫీజు కట్టలేక గ్రామానికి వెళ్లిపోయిందని, ఆ బాలికతో తమకు ఎటువంటి సంబంధం లేదని చెప్పినట్లు పేర్కొన్నారు. గత సంవత్సరంలో కూడా హాస్టల్‌లో ఇదే పరిస్థితి జరిగినప్పటికీ ఉన్నతాధికారులు పట్టించుకోలేదని, ఈ విషయంపై ఉన్నతాధికారులు చర్యలు తీసుకోవాలని ఆమె డిమాండ్ చేశారు.

చికిత్స పొందుతూ రిమాండ్ ఖైదీ మృతి



రాజబాబు మృతదేహం

మహారాణిపేట (విశాఖ)/కొయ్యూరు: హత్య కేసులో ఏ2 నిందితుడిగా ఉన్న భూసరి రాజబాబు కేజీహెచ్‌లో చికిత్స పొందుతూ ఆదివారం ఉదయం మరణించాడు. గతేడాది నవంబర్‌లో కొయ్యూరు మండలం, బకులూరు సమీపంలో జరిగిన హత్య కేసులో రాజబాబు రెండో నిందితుడిగా ఉన్నారు. రిమాండ్ ఖైదీగా విశాఖ సెంట్రల్ జైల్లో శిక్ష అనుభవిస్తున్నాడు. అతని ఆరోగ్యం విషమించడంతో కేజీహెచ్‌కు తరలించారు. ఇక్కడ చికిత్స పొందుతూ ఆదివారం ఉదయం మరణించాడు. పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని జైలు అధికారుల సమక్షంలో కుటుంబ సభ్యులకు అప్పగించినట్లు కేజీహెచ్ ఆర్ఎంవో డాక్టర్ మెహర్‌కుమార్ తెలిపారు. విశాఖ వన్‌టౌన్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పెరిగిన ఉష్ణోగ్రతలు

చింతపల్లి: మన్యంలో కనిష్ట ఉష్ణోగ్రతలు పెరిగాయి. ఉష్ణోగ్రతలు పెరుగుతున్నా ఉదయం 9 గంటలు దాటే వరకూ మంచు కురుస్తుండడంతో దారి కనిపించక వాహన దారులు ఇబ్బందులు పడుతున్నారు. ఆదివారం జీకే వీధిలో 9.6 డిగ్రీలు, డుంబ్రిగుడలో 10.6 డిగ్రీలు, జి.మాడుగులలో 11.0 డిగ్రీలు, అరకులోయలో 11.6 డిగ్రీలు, ముంచంగిపుట్టులో 12.1 డిగ్రీలు, చింతపల్లిలో 12.5 డిగ్రీలు, పెదబయలులో 13.2 డిగ్రీలు, హుకుంపేటలో 13.9 డిగ్రీలు, పాడేరులో 14.1 డిగ్రీలు, అనంతగిరిలో 14.8 డిగ్రీలు, కొయ్యూరులో 14.8 డిగ్రీల కనిష్ట ఉష్ణోగ్రతలు నమోదైనట్లు చింతపల్లి ప్రాంతీయ వ్యవసాయ పరిశోధనా స్థానం ఏడీఆర్, వాతావరణ విభాగం నోడల్ అధికారి డాక్టర్ ఆళ్ల అప్పలస్వామి తెలిపారు.



తాగునీటి కోసం తంటాలు పడుతున్న కొండరెడ్డి మహిళలు



అభివృద్ధికి నోచుకోని అంతర్గత రహదారి



ఐటీడీఏ ఫామ్ ప్రవేశ ద్వారం ఆర్చి

కొండ దించారు... అండ మరిచారు

కష్టాల వలయంలో కొండరెడ్లు

పునరావాస కేంద్రాల్లో ఇక్కట్లు

కూనవరం: పచ్చని ప్రకృతి ఒడిలో బాహ్య ప్రపంచానికి దూరంగా ఎత్తైన కొండలపై నివసిస్తున్న కొండరెడ్లు మైదాన ప్రాంతానికి తరలివచ్చి కష్టాల సుడిగుండంలో చిక్కి కొట్టు మిట్టాడుతున్నారు. మండల పరిధిలో పైదిగూడెం, ఐటీడీఏ ఫారం, భైరవపట్నం, బండారుగూడెం, గండికొత్తగూడెం తదితర గ్రామాల్లో కొండరెడ్లను పునరావాస కేంద్రాలకు తరలించారు. కొండలు దిగిరండీ... అండగా మేముంటాము అని రెండు దశాబ్దాల క్రితం అప్పటి ఐటీడీఏ అధికాలు ఇచ్చిన హామీతో సుమారు 50 కుటుంబాలకుపైగా విలీన మండలాల్లోని మైదాన ప్రాంతానికి తరలి వచ్చాయి. ఇళ్లు కట్టిస్తాం, తాగునీరు, సాగునీరు, వ్యవసాయ భూమి వంటి సకల సౌకర్యాలు కల్పిస్తామని వారికి అధికారులు నమ్మబలికారు. అధికారుల మాటలు నమ్మి మైదాన ప్రాంతానికి తరలి వచ్చిన కొండరెడ్లను పట్టించుకునే వారే కరువయ్యారు. అధికారుల మాటలు నీటిమీద రాతలు అన్న చందంగా మారాయి. తోతులగుట్ట సమీపంలోని ఐటీడీఏ ఫారం పునరావాస కేంద్రంలో ఉన్న కొండరెడ్ల బాధలు వర్ణనాతీతం. మౌలిక వసతులకు నోచుకోక నానా అవస్థలు పడుతున్నారు. కూటూరు గట్టు పరిధిలో ఎత్తైన కొండల్లో కళింగమిద్ది, చింతగండి, పెద్దవాగు తదితర గ్రామాలకు చెందిన 21 కొండరెడ్ల కుటుంబాలు 2000 సంవత్సరంలో పైదిగూడెం ఐటీడీఏ ఫారంకు తరలివచ్చారు. ప్రభుత్వం వారికి పక్కాగృహాలు నిర్మించి, మౌలిక వసతులను గాలికి వదిలేసింది. వ్యవసాయ భూమి సమకూర్చక పోవడంతో కూలిపనులకు వెళుతూ పూట గడుపుతున్నారు. వ్యవసాయ సీజన్ ముగిసిందంటే, వారికి బతుకుదెరువు కరవుతుంది. వేసవిలో తాగునీటి ఎద్దడి తప్పడం లేదని మదనపడుతున్నారు. పాతికేళ్ల కిందట ఇక్కడి వచ్చిన తమకు పిల్లాజల్లాతో మరో 20 కుటుంబాలు తోడయ్యాయని వారికి ఇప్పటి వరకు ఇల్లు, వాకిలీ లేదని వాపోతున్నారు. అంగట్లో అన్నీ ఉన్నా అల్లుడినోట్లో శని అన్నచందంగా ఐటీడీఏ ఫాంలో 105 ఎకరాల భూమి నిరుపయోగంగా ఉన్నా తాము సాగుచేసుకునేందు ఒక్క ఎకరం కూడా ఇవ్వలేదని ఆవేదనవ్యక్తం చేస్తున్నారు.



కొండరెడ్ల పునరావాస కేంద్రం

అందరికీ పక్కాగృహాలు నిర్మించాలి



ఐటీడీఏ ఫామ్‌లో గతంలో కంటే రెట్టింపు కుటుంబాలు పెరిగాయి. ప్రస్తుతం 48 కుటుంబాలు ఉన్నాయి. అందరికీ పక్కాగృ హాలు నిర్మించాలి. పాత గృహాలు కొద్దిపాటి వర్షం వచ్చినా కూలుతున్నాయి. తక్షణం మరమ్మతులు చేయాలి. – సోమిరెడ్డి, ఐటీడీఏ ఫామ్

రెండు ఎకరాల భూమి ఇవ్వాలి



కొండలుదిగితే సాగుభూమి ఇస్తామన్నారు. ఆ మాట నమ్మి కిందికి వస్తే సెంటు భూమికూడా ఇవ్వలేదు. భూమిలేక కూలిపనులకు వెళుతున్నాం. సాగుభూమి ఉంటే జొన్న, మినుము, పెసలు పండించుకునే వాళ్లం. ఇప్పటికైనా కుటుంబానికి రెండు ఎకరాల చొప్పున భూమి ఇవ్వాలి.

– వల్లా తమ్మిరెడ్డి, పైదిగూడెం

వాటర్ ట్యాంక్ ఏర్పాటు చేయాలి



ఐటీడీఏ ఫామ్‌లో పేరుకు మూడు బోర్లు ఉన్నాయి. వేసవి వస్తే తాగునీటి ఎద్దడి తప్పడం లేదు. జల్‌జీవన మిషన్ ద్వారా ట్యాంక్ నిర్మించి, ఇంటింటికీ కుళాయిలు వేయాలి.

– కోర్ల ఆదిలక్ష్మి, ఐటీడీఏ ఫామ్

అంతర్గత రోడ్లు వేయాలి



పైదిగూడెం పునరావాస కాలనీలో అంతర్గత రోడ్లు అధ్వానంగా ఉన్నాయి. కాలనీ నిర్మించి పాతికేళ్లు అయినా తట్టెడు మట్టిపోసిన దాఖలాలు లేవు, వర్షాకాలం వస్తే దారులన్నీ బురదతో ఉంటాయి. ఇప్పటికైనా మెటల్‌రోడ్లు వేయాలి.

– వల్లా కొమ్ములమ్మ

ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికలకు ఏర్పాట్లు

- 27 జరిగే ఎన్నికలకు సిబ్బంది నియామకం
- 18న తొలి విడత శిక్షణ తరగతులు
- 25 వేల బ్యాలెట్ పత్రాల తయారీ



కలెక్టర్ కార్యాలయం (ఫైల్)

మహారాణిపేట(విశాఖ): ఈ నెల 27న జరగనున్న ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల కోసం ఏర్పాట్లు శరవేగంగా జరుగుతున్నాయి. కలెక్టర్ ఎం.ఎన్.హరేంధిర ప్రసాద్ సారథ్యంలో జిల్లా రెవెన్యూ అధికారి భవానీశంకర్ ఏర్పాట్లు చేస్తున్నారు. పది మంది అభ్యర్థులు ఎన్నికల బరిలో నిలిచారు. అభ్యర్థుల పేరుతో తెలుగులో బ్యాలెట్ పత్రం రూపొందించి, ప్రింటింగ్ కోసం కర్నూలు ప్రభుత్వ ముద్రణాలయానికి పంపారు.

అక్షర క్రమంలో బ్యాలెట్ పత్రం

అభ్యర్థులు నామినేషన్‌లో పేర్కొన్న మేరకు తొలి అక్షరం ఆధారంగా తెలుగు అక్షర క్రమంలో బ్యాలెట్ పత్రం నమూనాను తయారు చేశారు. తుది జాబితా మేరకు విశాఖపట్నం, విజయనగరం, శ్రీకాకుళం, పార్వతీపురం మన్యం, అనకాపల్లి, అల్లూరి సీతారామరాజు జిల్లాల్లో మొత్తం 22,493 మంది ఓటర్లు ఉన్నారు. వీరికి అదనంగా మరో పది శాతం కలిపి సుమారు 25 వేల బ్యాలెట్ పత్రాలను ముద్రిస్తున్నారు. ఇవి ఈ నెల 18, 19 తేదీల్లో విశాఖ చేరుకునే అవకాశం ఉంది. ఎన్నికల తేదీకి రెండు రోజుల ముందు వాటిని బందోబస్తు నడుమ పోలింగ్ కేంద్రాలకు తరలించనున్నారు.

18 నుంచి తొలి విడత శిక్షణ

ఎన్నికల నిర్వహణ కోసం ఈ నెల 18 నుంచి సిబ్బందికి, ఎన్నికల అధికారులకు శిక్షణ ఇవ్వనున్నారు. రెండో విడత శిక్షణ 24న ఉంటుంది. ఉత్తరాంధ్ర జిల్లాల్లో 123 పోలింగ్ కేంద్రాల్లో ఎన్నికలు జరపనున్నారు. ఒక్కో పోలింగ్ కేంద్రంలో ఒక ప్రిసైడింగ్ అధికారి(పీవో) తోపాటు ముగ్గురు సిబ్బంది అవసరం. మొత్తం 492 మంది సిబ్బందితోపాటు అదనంగా మరో పది శాతం మందిని ఎన్నికల నిర్వహణకు సిద్ధం చేస్తున్నారు.

రోడ్డు ప్రమాదంలో భార్యాభర్తల దుర్మరణం

- ద్విచక్రవాహనంపై వెళుతుండగా ఘటన
- మృతులు తెలంగాణవాసులు



సంఘటన జరిగిన ప్రదేశంలో ద్విచక్రవాహనంపై పడి ఉన్న రాంబాబు



ముత్యాలమ్మ(ఫైల్)



రాంబాబు(ఫైల్)

ఎటపాక: స్థానిక నవోదయ పాఠశాల సమీపంలో జామాయిల్ కర్రల లోడు ట్రాక్టర్ ఢీకొని భార్యాభర్తలు దుర్మరణం చెందారు. సీఐ కన్నపరాజు తెలిపిన వివరాల ప్రకారం తెలంగాణ రాష్ట్రం భద్రాద్రి కొత్తగూడెం జిల్లా దుమ్ముగూడెం మండలంలోని మారాయిగూడెం పంచాయతీ భీమవరం గ్రామానికి చెందిన సోయం రాంబాబు(45),ముత్యాలమ్మ(40) ద్విచక్రవాహనంపై భద్రాచలం వచ్చారు. పని ముగించుకుని ఆదివారం రాత్రి ఎటపాక మండలం బొజ్జిగుప్ప గ్రామం మీదుగా స్వ గ్రామానికి తిరిగి ప్రయాణమయ్యారు. ఈసమయంలో ఎదురుగా జామాయిల్ కర్ర లోడుతో ట్రాక్టర్ భద్రాచలం వస్తోంది. సింగిల్‌రోడ్డు కావడంతో వారు నవోదయ పాఠశాల సమీపంలో ట్రాక్టర్‌ను దాటి వెళ్లేక్రమంలో ట్రాక్టర్‌లో ఉన్న కర్ర ద్విచక్రవాహనానికి తగలడంతో ఈప్రమాదం జరిగింది. భార్యాభర్తలిద్దరికీ తీవ్ర గాయాలయ్యాయి. రోడ్డుపై పడిపోయిన వీరిని 108 వాహనంలో భద్రాచలం ఏరియా ఆస్పత్రికి తరలించగా అప్పటికే వారు మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు.పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



ప్రమాదానికి గురైన బైక్




సాయి చరణ్ మృతదేహం

వివాహానికి వెళ్లి వస్తూ బాలుడు మృతి

జి.మాడుగుల: మండలంలోని నుర్మతి రోడ్డులో ఆదివారం జరిగిన ప్రమాదంలో విశాఖ జిల్లా పెందుర్తికి చెందని ఓ బాలుడు మృతిచెందాడు. వివరాలు ఇలా ఉన్నాయి. జి.మాడుగుల మండలం నుర్మతి పంచాయతీ అనర్భ గ్రామంలో జరిగిన వివాహానికి పెందుర్తి నుంచి కర్రి సాయి చరణ్(17) అనే బాలుడు వెళ్లాడు. తిరుగు ప్రయాణంలో ద్విచక్రవాహనం మీద వస్తుండగా గుదలం వీధి వద్ద బైక్ అదుపుతప్పి ప్రమాదానికి గురయ్యాడు. కిందపడిన సాయి చరణ్ తీవ్రంగా గాయపడి అక్కడికక్కడే మృతి చెందాడు.ఈ ప్రమాదంపై పోలీసులకు ఫిర్యాదు అందాల్సి ఉంది.

కవర్లు ఇక్కడ.. కందిపప్పు ఎక్కడ ?

- తుప్పల్లో వందకుపైగా కవర్లు
- అనుమానం వ్యక్తం చేస్తున్న గ్రామస్తులు



10/2024 బ్యాచ్ నంబర్ ఉన్న ఖాళీ కందిపప్పు కవర్లు



తుప్పల్లో పడి ఉన్న కవర్లు

అడ్డతీగల: ప్రజావసరాల కోసం ప్రభుత్వం సబ్సిడీపై పంపిణీ చేసే కంది పప్పు ప్యాక్ చేసిన ఖాళీ కవర్లు తుప్పల్లో కుప్పలు తెప్పలుగా పడి ఉండడం కలకలం రేపుతోంది. అడ్డతీగల శివారు డి.భీమవరం రోడ్డులో ఇవి ఉన్నాయి. పౌరసరఫరాలశాఖ మండల లెవిల్ స్టాక్ పాయింట్‌కి సమీపంలో ఈ కవర్లు పడి ఉండడం పలు అనుమానాలకు తావిస్తోంది.ఒక కిలో కందిపప్పు పట్టేంతగా ఉన్న కవర్లపై బ్యాచ్ నంబర్ 10/2024, ప్యాకింగ్ తేదీ అక్టోబర్ 2024, ఐదు నెలల్లో వినియోగించాలని ముద్రించి ఉంది. ఇలా తుప్పల్లో ఖాళీ కవర్లు కనిపించడంతో అందులో ఉండవలసిన కందిపప్పు ఏమైందో తెలియాల్సి ఉంది.పౌరసరఫరాల శాఖ నుంచి ఎంఎల్ఎస్ పాయింట్‌కి వచ్చే సరకును అక్కడి నుంచి రేషన్‌డిపోలకు చేరవేయాలి. రేషన్ డీలర్లు వాటిని కార్డుదారులకు పంపిణీ చేయాలి. పేదలకు అందవలసిన కందిపప్పును మాయం చేసి, వేరే బ్యాగ్‌లో వేసుకుని ఖాళీ కవర్లు ఊరికి దూరంగా పడేశారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. అధికారులు వీటి నిగ్గు తేల్చాలని గ్రామస్తులు కోరుతున్నారు.

విద్యార్థినిపై టెన్త్ విద్యార్థినుల దాడి

- పాడేరు సెయింటాన్స్ పాఠశాలలో ఘటన
- 7వ తరగతి విద్యార్థినిపై ముగ్గురు దాడి
- తాము చేసిన తప్పుల్ని వేరే విద్యార్థినులకు చెబుతోందని ఆరోపణ
- పాఠశాలను సందర్శించిన ఎమ్మెల్యే విశ్వేశ్వరరాజు
- సంఘటనపై సమగ్ర విచారణ జరిపించాలని డిమాండ్



విద్యార్థినిపై దాడి చేస్తున్న సహచర విద్యార్థినులు(ఫైల్)



పాఠశాలలో విద్యార్థినులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే మత్స్యరాస విశ్వేశ్వరరాజు

పాడేరు : జిల్లా కేంద్రమైన పాడేరు పట్టణంలోని సెయింటాన్స్ ఇంగ్లిష్ మీడియం పాఠశాలలో ఓ గిరిజన విద్యార్థినిపై అదే పాఠశాలలో చదువుతున్న విద్యార్థినులు దాడి చేసిన ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. పాఠశాలలో ఏడో తరగతి చదువుతున్న ఓ విద్యార్థినిపై అదే పాఠశాలలో 10వ తరగతి చదువుతున్న ముగ్గురు విద్యార్థినులు జనవరి 5న దాడికి పాల్పడ్డారు. దాడి చేసిన దృశ్యాలను సెల్‌ఫోన్‌లో బంధించారు. ఈ వీడియో ఈ నెల 16న వాట్సాప్ గ్రూపుల్లో వైరల్‌గా మారింది. దీంతో విషయం తెలుసుకున్న పాడేరు ఎమ్మెల్యే మత్స్యరాస విశ్వేశ్వరరాజు ఆదివారం సాయంత్రం స్థానిక సెయింటాన్స్ పాఠశాల వసతి గృహాన్ని సందర్శించారు. పాఠశాల నిర్వాహకులు, విద్యార్థినులతో మాట్లాడి, సంఘటన గురించి ఆరా తీశారు. విద్యార్థినులకు కౌన్సెలింగ్ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సెయింటాన్స్ పాఠశాల వివాదాలకు నిలయంగా మారిందని, తరచూ ఏదో ఒక సంఘటన జరుగుతూనే ఉందన్నారు. విద్యార్థినులపై యాజమాన్యం పర్యవేక్షణ కొరవడడంతోనే ఇలాంటి సంఘటనలు చోటుచేసుకుంటున్నాయని చెప్పారు. ఈ వ్యవహారంపై జిల్లా ఉన్నతాధికారులు సమగ్ర విచారణ చేపట్టాలని, భవిష్యత్తులో ఇలాంటివి పునారావృతం కాకుండా చూడాలన్నారు. జిల్లా విద్యాశాఖ అధికారి ఆదేశాల మేరకు ఎంఈవో విశ్వప్రసాద్ వసతి గృహాన్ని సందర్శించారు. పాఠశాల యాజమాన్యం, విద్యార్థినులతో వేర్వేరుగా మాట్లాడారు. నివేదికను జిల్లా ఉన్నతాధికారులకు అందజేస్తామని మీడియాకు ఆయన తెలిపారు. ఈ వ్యవహారానికి సంబంధించి వైరల్‌గా మారిన వీడియోలో టెన్త్ విద్యార్థినుల్లో కొందరు సిగరెట్ తాగిన వ్యవహారంపై 7వ తగరతి విద్యార్థినిని ప్రశ్నిస్తూ దాడి చేస్తున్న దృశ్యాలు స్పష్టంగా కనిపించాయి.

పర్యాటక ప్రాంతాలు కిటకిట

జిల్లాలో పర్యాటక ప్రాంతాలు కిటకిటలాడాయి. ప్రకృతి అందాలను తిలకించేందుకు భారీగా టూరిస్టులు తరలిరావడంతో సందర్శిత ప్రాంతాలన్నీ సందడిగా మారాయి. లంబసింగి,తాజంగి జలాశయం,చెరువులవేనం వ్యూపాయింట్, కొత్తపల్లి, పిట్టలబొర్ర జలపాతాలు.. తదితర ప్రాంతాలకు ఆదివారం భారీగా సందర్శకులు తరలివచ్చారు.



చెరువులవేనంలో సందడి చేస్తున్న పర్యాటకులు



పిట్టలబొర్ర జలపాతం వద్ద..



కొత్తపల్లి జలపాతం వద్ద స్నానాలు చేస్తున్న టూరిస్టులు



థింసా నృత్యం చేస్తున్న పాడేరు ఎమ్మెల్యే విశ్వేశ్వరరాజు

చింతపల్లి: ఆంధ్రాకాశ్మీరు లంబసింగిలో పర్యాటకులు సందడి చేశారు. మైదాన ప్రాంతాల నుంచి కుటుంబాలతో ఇక్కడికి వచ్చి ప్రకృతి అదాలతో పాటు మంచు సోయగాలను ఆస్వాదించారు. పర్యాటకుల రద్దీతో లంబసింగి, తాజంగి జలాశయం వద్ద ఉదయం నుంచి సందడి వాతావరణం ఏర్పడింది. చెరువులవేనం వ్యూపాయింట్ వద్ద పాల సముద్రాన్ని తలపించే మంచు అందాలకు పరశించిన సందర్శకులు ఫొటోలు, సెల్ఫీలు తీసుకున్నారు.

పెదబయలు: మండలంలో గిన్నెలకోట పంచాయతీ పిట్టలబొర్ర జలపాతాన్ని ఆదివారం భారీ సంఖ్యలో పర్యాటకులు సందర్శించారు. 150 అడుగుల ఎత్తు నుంచి జాలువారుతున్న నీటి ప్రవాహం ప్రకృతి ప్రేమికులను కట్టి పడేసింది. జలపాతం దగ్గర వరకు వాహనాలు వెళుతుండడంతో ఆంధ్ర,ఒడిశా రాష్ట్రాల్లో పలు ప్రాంతాల నుంచి సందర్శకులు అధిక సంఖ్యలో ఇక్కడికి వస్తున్నారు.

జి.మాడుగుల: పలు ప్రాంతాల నుంచి ప్రత్యేక వాహనాల్లో తరలివచ్చిన పర్యాటకులు కొత్తపల్లి జలపాతం వద్ద సందడి చేశారు. పెద్దపెద్ద బండ రాళ్లపై నుంచి జాలువారుతున్న నీటి ప్రవాహంలో స్నానాలు చేశారు. వ్యూ పాయింట్ వద్ద ఫొటోలు,సెల్ఫీలు దిగారు. రోజంతా కుటుంబ సభ్యులు, స్నేహితులతో ఆటపాటలతో ఉల్లాసంగా ఉత్సాహంగా గడిపారు.

థింసా కళాకారులను ఆదుకోవాలి

డుంబ్రిగుడ: ప్రముఖ పర్యాటక కేంద్రం చాపరాయి జలపాతం వద్ద సందర్శకులను అలరిస్తున్న థింసా కళాకారులను అధికారులు ఆదుకోవాలని వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు, పాడేరు ఎమ్మెల్యే మత్స్యరాస విశ్వేశ్వరరాజు కోరారు. ఆదివారం ఆయన చాపరాయి జలపాతాన్ని సందర్శించి, అక్కడి థింసా నృత్య కళాకారులతో మాట్లాడారు. ఐటీడీఏ నుంచి అందించే ప్రోత్సాహం కోసం ఆరా తీశారు. చాపరాయి జలపాతానికి వచ్చే ఆదాయంలో కొంత మొత్తాన్ని థింసా నృత్య కళాకారులకు కేటాయించాలని అధికారులను కోరారు. వైఎస్సార్‌సీపీ నాయకుడు కూడా సుబ్రమణ్యం పాల్గొన్నారు.

క్లుప్తంగా

జేఈఈ మెయిన్స్‌లో సత్తా చాటిన తుంగమడుగుల విద్యార్థి



రుద్రేష్‌రెడ్డిని అభినందిస్తున్న తల్లిదండ్రులు

అడ్డతీగల: మండలంలో తుంగమడుగులకు చెందిన పీరు ప్రణవ రుద్రేష్‌రెడ్డి జేఈఈ మెయిన్స్‌లో సత్తాచాటాడు. 97.45 పర్సంటైల్‌తో ఉత్తమ ప్రతిభ కనబరిచినట్టు రుద్రేష్‌రెడ్డి తండ్రి పీరు చింతలబ్బాయి తెలిపారు. మద్రాస్ ఐఐటీలో కంప్యూటర్ సైన్స్‌లో బీటెక్ చేసి, అనంతరం సివిల్స్ సాధించి, పేద ప్రజలకు సేవ చేయాలన్నది తన లక్ష్యమని రుద్రేష్‌రెడ్డి ఈ సందర్భంగా చెప్పాడు. తండ్రి ఫిజికల్ డైరెక్టర్‌గా తూర్పు గోదావరి జిల్లా సీతానగరం మండలం వెదుళ్లపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పనిచేస్తున్నారు. తల్లి ఎస్‌జీటీ టీచర్‌గా తూర్పు గోదావరి జిల్లా రాజానగరం మండలం నరేంద్రపురం ఎంపీపీ పాఠశాలలో పనిచేస్తున్నారు.

నాణ్యమైన విద్యతో పాటు మంచి ఆహారాన్ని అందించాలి



విద్యార్థులతో మాట్లాడుతున్న చింతపల్లి జుడీషియల్ ప్రథమశ్రేణి న్యాయమూర్తి రోహిత్

చింతపల్లి: గురుకుల విద్యార్థులతో పాటు ఆశ్రమ పాఠశాల విద్యార్థులకు నాణ్యమైన విద్యతో పాటు మంచి ఆహారాన్ని అందించేందుకు చర్యలు చేపట్టాలని చింతపల్లి ప్రథమశ్రేణి జుడీషియల్ మెజిస్ట్రేట్ రోహిత్ అన్నారు. స్థానిక గిరిజన గురుకుల జూనియర్ కళాశాల,ఏకలవ్య పాఠశాలతో పాటు బాలురు,బాలికల ఆశ్రమ పాఠశాలలను ఆదివారం ఆయన సందర్శించారు.ఈ సందర్భంగా విద్యార్థులతో మాట్లాడారు. బోధన, భోజన సౌకర్యం,తాగునీరు,మరుగుదొడ్ల సౌకర్యంతో పాటు పరిసరాల పరిశుభ్రత గురించి అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో కోర్టు సిబ్బంది పాల్గొన్నారు.

యువతికి ఆశ్రయం



ఏయూటీటీ కార్యదర్శి వాసుతో యువతి

సీతమ్మధార(విశాఖ): భర్త మద్యానికి బానిసై రోజూ చిత్ర హింసలు పెడుతుండటంతో పాడేరుకు చెందిన ఆదివాసీ యువతి సాయి (20) ఇల్లు వదిలి ద్వారకానగర్‌లోని ఆర్టీసీ కాంప్లెక్స్ దగ్గర్లో ఉన్న టిఫిన్ షాపులో పనికి చేరింది. దిక్కు తోచని స్థితిలో ఉన్న ఆమె పరిస్థితి చూసి టౌన్ వెండింగ్ కమిటీ సభ్యుడు బాలు ఏయూటీటీ మహిళా షెల్టర్ హోంకి సమాచారం అందించారు. ఆమెకు తాత్కాలిక వసతి కల్పించినట్లు సంస్థ కార్యదర్శి ప్రగడ వాసు తెలిపారు.

క్యాన్సర్‌ను జయిద్దాం



శారీ వాక్‌లో సినీనటి గౌతమి, మేయర్ హరివెంకట కుమారి తదితరులు



ర్యాంప్ వాక్ చేస్తున్న యువతులు



పింక్ శారీ వాక్‌లో జుంబా డ్యాన్స్ చేస్తున్న మహిళలు



శారీ వాక్‌లో ఉత్సాహంగా మహిళలు



వాక్ చేస్తున్న మహిళలు

- సినీనటి గౌతమి
- బీచ్‌రోడ్డులో విజయవంతంగా పింక్ సఖి శారీ వాక్
- దేశంలో తొలిసారిగా విశాఖ వేదికగా నిర్వహణ

ఏయూక్యాంపస్ : క్యాన్సర్‌పై అవగాహన పెంచుకోండి...ఆరోగ్యంగా జీవించండి అంటూ సినీనటి, లైఫ్ ఎగైన్ ఫౌండేషన్ వ్యవస్థాపకురాలు గౌతమి తాడిమల్ల నగరవాసుల్లో ఉత్సాహాన్ని నింపారు. ఆదివారం బీచ్‌రోడ్డులో రోహిత్ మెమోరియల్ ట్రస్ట్, రౌండ్ టేబుల్ లేడీస్ సర్కిల్ సంయుక్తంగా నిర్వహించిన పింక్ సఖి శారీ వాక్‌లో ఆమె ప్రసంగించారు. క్యాన్సర్ వస్తే జీవితం అక్కడితో ఆగిపోతుందనే అపోహ నుంచి ముందుగా బయటపడాలన్నారు. సరైన చికిత్స తీసుకుంటే ఎంతకాలమైనా జీవించవచ్చు అనడానికి ప్రత్యక్ష ఉదాహరణగా నేనేనని పేర్కొన్నారు. ఆరోగ్యం కాపాడుకోవడం ఎంత అవసరమో గుర్తించాలని ప్రజలకు సూచించారు. మీపై ఒక కుటుంబం ఆధారపడి ఉందనే విషయం మరువకూడదన్నారు. ప్రపంచాన్ని మార్చే శక్తి మహిళలకు ఉందన్నారు. క్యాన్సర్ ఎటువైపునుంచైనా, ఎవరికైనా వచ్చే అవకాశం ఉందన్నారు. క్యాన్సర్ లక్షణాలను తెలుసుకోవడం, సరైన చికిత్స తీసుకోవడం, నిండైన జీవితాన్ని అనుభవించడం ఎంతో అవసరమన్నారు. నగర మేయర్ గొలగాని హరి వెంకట కుమారి మాట్లాడుతూ ప్రతి ఏడాది వేలాది మంది క్యాన్సర్‌తో మరణిస్తున్నారన్నారు. మహిళలు అధికంగా క్యాన్సర్ బారిన పడుతున్నారని, ప్రజల్లో మరింత చైతన్యం, అవగాహన పెంపొందించడానికి ఇటువంటి కార్యక్రమాలు ఉపయుక్తంగా నిలుస్తాయని పేర్కొన్నారు. రాష్ట్రంలో తొలిసారిగా విశాఖ వేదికగా ఈ కార్యక్రమాన్ని నిర్వహించడం అభినందనీయమని చెప్పారు. ప్రాథమిక దశల్లో క్యాన్సర్‌ను గుర్తిస్తే చికిత్స అందించడం, ప్రాణాలను రక్షించడం సాధ్యపడుతుందన్నారు. కార్యక్రమ నిర్వాహకులను అభినందించారు.

రోహిత్ మెమోరియల్ ట్రస్ట్ చైర్మన్ జి.అనంతరామ్ మాట్లాడుతూ మరింత విస్తృత అవగాహన ప్రజల్లో కల్పించడం ఈ కార్యక్రమం ప్రధాన ఉద్దేశమన్నారు. తాము చేపడుతున్న ప్రతీ కార్యక్రమానికి సంపూర్ణ సహాయం అందిస్తున్న అందరికీ కృతజ్ఞతలు తెలిపారు. త్వరలో పీసీవోడీపై వైజాగ్ వలంటీర్స్‌తో కలిసి అవగాహన కార్యక్రమాలను చేపడతామన్నారు. కార్యక్రమానికి ముందుగా యాంకర్, సినీనటి శిల్పా చక్రవర్తి వ్యాఖ్యానంతో సాగిన జుంబా డాన్స్, ఫ్యాషన్ షో ఆకట్టుకున్నాయి. పెద్దసంఖ్యలో మహిళలు, యువత, చిన్నారులు పింక్ సఖి శారీ వాక్‌లో ఉత్సాహంగా పాల్గొన్నారు. పలువురు పాఠశాల చిన్నారులు ప్లకార్డులతో ర్యాలీలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా విభిన్న రంగాలలో రాణిస్తున్న మహిళలు, క్యాన్సర్‌ను జయించిన వారిని వేదికపై సత్కరించారు. కార్యక్రమంలో రోహిత్ మెమోరియల్ ట్రస్ట్ ఉపాధ్యక్షురాలు డాక్టర్ మీనాక్షి అనంతరామ్, డైరెక్టర్ ప్రాజెక్ట్ (ఆర్ఎంటి) గుర్మీత్ కోహ్లి, శ్రావణ్ షిప్పింగ్ సర్వీసెస్ లిమిటెడ్ ఎం.డి డాక్టర్ జి.సాంబశివ రావు, గురుద్వార సాథ్ సంగత్ అధ్యక్షుడు డాక్టర్ డి.ఎస్ ఆనంద్,ఏజ్ కేర్ ఫౌండేషన్ మేనేజింగ్ ట్రస్టీ డాక్టర్ ఎన్.ఎస్ రాజు, వరుణ్ గ్రూప్ చైర్మన్ ప్రభు కిషోర్, అభిజ్ఞ, హెచ్‌సీజీ క్యాన్సర్ సెంటర్ వైద్యులు డాక్టర్ ఆదిత్య, మహాత్మ గాంధీ క్యాన్సర్ ఆస్పత్రి వైద్యులు వి.మురళీకృష్ణ, రాష్ట్ర ఆరోగ్య శాఖ డైరెక్టర్ డాక్టర్ పద్మావతి, డీఎంహెచ్‌వో డాక్టర్ జగదీశ్వరరావు పాల్గొన్నారు.

సివిల్ సర్వీసెస్ అథ్లెటిక్ పోటీలకు పీడీ పోతురాజు



రంపచోడవరం: ముసురుమిల్లి గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలలో ఫిజికల్ డైరెక్టర్(పీడీ)గా పనిచేస్తున్న కలుముల పోతురాజు ఆలిండియా సివిల్ సర్వీసెస్ అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్‌లో పాల్గొనే అవకాశాన్ని దక్కించుకున్నారు. సివిల్ సర్వీసెస్ అథ్లెటిక్స్ చాంపియన్ షిప్ 2024–25కు సంబంధించి ఈ నెల 19 నుంచి 21 వరకు పంజాబ్ రాష్ట్రం చండీగఢ్ స్పోర్ట్స్ కాంప్లెక్స్ సెక్టార్ –7లో జరిగే మీట్‌కి ఏపీ నుంచి ఆయన పాల్గొననున్నారు. అథ్లెటిక్స్‌లో 800 మీటర్ల పరుగు పందెంలో ఎంపికైనట్లు పోతురాజు తెలిపారు. స్పోర్ట్స్ మీట్‌లో పాల్గొనేందుకు ఏడు రోజుల పాటు స్పెషల్ క్యాజువల్ లీవ్‌లు, ఖర్చులు మంజూరు చేస్తూ ఉత్తర్వులు అందాయి. స్పోర్ట్స్ మీట్‌కు ఎంపికైన ఆయనను హెచ్‌ఎం ఆదివిష్ణుదొర, అల్లూరి వ్యాయామ ఉపాధ్యాయుల అసోసియేషన్ అధ్యక్షుడు కృష్ణారావు, పీడీ చిన్నస్వామిరెడ్డి, తిరుపతిరావు, ధర్మరాజు, నాగిరెడ్డి, ఉపాధ్యాయులు అభినందనలు తెలిపారు.

విశాఖలో ఐపీఎల్ పండగ

- మార్చి 24, 30న రెండు టీ–20 మ్యాచ్‌లు
- ఊపందుకున్న స్టేడియం ఆధునికీకరణ పనులు



వైఎస్సార్ స్టేడియం ప్రవేశ ద్వారం వద్ద సొబగులు

విశాఖ స్పోర్ట్స్: ఐపీఎల్ మ్యాచ్‌లకు విశాఖలోని వైఎస్ రాజశేఖరరెడ్డి ఏసీఏ వీడీసీఏ స్టేడియం మరోసారి వేదిక కానుంది. ఢిల్లీ క్యాపిటల్స్ మరోసారి హోమ్ పిచ్‌గా వైఎస్సార్ స్టేడియాన్ని ఎంచుకోవడంతో ఆధునికీకరణ పనులు వేగవంతమయ్యాయి. మొత్తంగా స్టేడియం ఎలివేషన్ మారిపోనుండగా, కార్పొరేట్ బాక్సులు, ఆటగాళ్ల గ్రీన్ రూంల్లోనూ ఆధునిక వసతుల కల్పన చకచకా సాగిపోతోంది. స్టేడియంలోని స్టాండ్స్‌లో కుర్చీలను కూడా ఏసీఏ మారుస్తోంది. దీంతో వైఎస్సార్ స్టేడియం సరికొత్త రూపుతో ఈసారి ఐపీఎల్ మ్యాచ్‌లకు ఆతిథ్యం ఇవ్వనుందని ఏసీఏ అపెక్స్ కౌన్సిల్ కార్యదర్శి సానా సతీష్ బాబు తెలిపారు. ఢిల్లీ క్యాపిటల్స్ జట్టు రెండో హోమ్ పిచ్‌గా విశాఖ స్టేడియాన్ని ఎంచుకుందని, ఈ సీజన్‌లోనూ రెండు మ్యాచ్‌లకు వైఎస్సార్ స్టేడియం వేదిక కానుందన్నారు. అందుకు తగిన విధంగా స్టేడియంలో వసతులను సమకూరుస్తున్నట్లు చెప్పారు.

మార్చి 24న డీసీతో ఎల్ఎస్‌జీ ఢీ

ఐపీఎల్ షెడ్యూల్ ప్రకారం మార్చి 24న ఢిల్లీ క్యాపిటల్స్‌తో లక్నో సూపర్ జెయింట్స్ జట్టు తలపడనుంది. రాత్రి ఏడున్నర గంటలకు ఈ మ్యాచ్ ప్రారంభమవుతుంది. మార్చి 30న మరో మ్యాచ్‌లో ఢిల్లీ క్యాపిటల్స్ జట్టు గత సీజన్ రన్నరప్ సన్‌రైజర్స్ హైదరాబాద్‌తో తలపడనుంది. ఈ మ్యాచ్ మధ్యాహ్నం 3.30 గంటలకు ప్రారంభమవుతుంది. హైదరాబాద్ జట్టు తరపున స్థానిక ఆటగాడు నితీష్‌కుమార్ బరిలోకి దిగనుండటంతో ఈ మ్యాచ్ ప్రత్యేకత సంతరించుకోనుంది.

నేడు రాష్ట్ర పురుషుల కబడ్డీ జట్టు ఎంపిక



సాధన చేస్తున్న క్రీడాకారులు

ఎంవీపీకాలనీ(విశాఖ): విశాఖ వేదికగా రాష్ట్ర పురుషుల కబడ్డీ జట్టును సోమవారం ఎంపిక చేస్తున్నట్లు కబడ్డీ అసోసియేషన్ జిల్లా కార్యదర్శి జేఎస్‌వీ ప్రసాదరెడ్డి తెలిపారు. ఇందుకోసం రాష్ట్ర కబడ్డీ సంఘం సెలక్షన్ కమిటీని నియమించిందని ఓ ప్రకటనలో వెల్లడించారు. కమిటీ సభ్యులుగా కబడ్డీ నేషనల్ మెడలిస్ట్ ప్రసాదరెడ్డి, అంతర్జాతీయ కబడ్డీ క్రీడాకారులు సీహెచ్ పద్మరాజు, వైపీ శ్రీనివాస్ ఉన్నారు. ప్రస్తుతం 19 మంది క్రీడాకారులకు నగరంలో ప్రత్యేక శిక్షణ ఇస్తున్నారు. ఇందులో 12 మందిని కమిటీ తుది జట్టుకు ఎంపిక చేస్తుంది. ఈ జట్టు కటక్ వేదికగా జరగనున్న 71వ జాతీయ కబడ్డీ పోటీల్లో ఆంధ్రప్రదేశ్ తరఫున ప్రాతినిధ్యం వహిస్తుంది. ఈ నెల 20 నుంచి 23వ తేదీ వరకు ఈ పోటీలు జరగనున్నాయి.

అథ్లెటిక్స్‌లో నేవీ ఉద్యోగికి బంగారు పతకం



జాతీయ అథ్లెటిక్స్‌లో గోల్డ్ మెడల్ సాధించిన అప్పనదొరకు పౌర సన్మానం చేస్తున్న గ్రామ పెద్దలు

దేవరాపల్లి : దేవరాపల్లి మండలం రైవాడ పంచాయితీ శివారు శంభువానిపాలేనికి చెందిన నేవీ ఉద్యోగి ఉగ్గిన అప్పన్నదొర జాతీయ స్థాయి అథ్లెటిక్స్‌లో పోటీల్లో బంగారు పతకాన్ని సాధించారు. సామాన్య గిరిజన కుటుంబానికి చెందిన అప్పన్నదొర రాజస్థాన్‌లో ఈ నెల 6 నుంచి 8 వరకు జరిగిన జాతీయ స్థాయి అథ్లెటిక్స్ క్రీడా పోటీల్లో 45 సంవత్సరాల విభాగంలో 4''400 రిలే పరుగు పందెంలో బంగారు పతకాన్ని సొంతం చేసుకున్నారు. అలాగే 4''100 రిలే పరుగు పందెం, 200 మీటర్ల పరుగు పందెంలో వెండి పతకాలను సాధించారు. లాంగ్ జంప్, ట్రిపుల్ జంప్‌లో కాంస్య పతకాలను సాధించారు.

అప్పన్న దొరకు ఘనంగా పౌర సన్మానం

క్రీడా పోటీల్లో సత్తా చాటి జాతీయ స్థాయిలో తమ గ్రామానికి గుర్తింపు తెచ్చిన అప్పన్నదొరను శంభువానిపాలెం గ్రామస్తులు ఆదివారం పౌర సన్మానం చేశారు. అభినందనలతో ముంచెత్తారు. అప్పన్న దొర క్రీడా స్ఫూర్తిని ప్రతీ ఒక్కరూ ఆదర్శంగా తీసుకోవాలంటూ పౌర సన్మానంలో పాల్గొన్న పంచాయతీ పెద్దలు చల్లా నాయుడు, చల్లా నానాజీ, ఉగ్గిన దేముళ్లు స్థానిక యువతకు సూచించారు.

బెంజ్ లారీ ఢీకొని బతుకు ఛిద్రం

- రోడ్డు ప్రమాదంలో ఇంటర్ విద్యార్థి మృతి
- మరో యువకుడికి తీవ్ర గాయాలు



ఎన్టీఆర్ ఆస్పత్రి పోస్టుమార్టం రూమ్ వద్ద రోదిస్తున్న మృతుడి కుటుంబ సభ్యులు



ఘటనా స్థలంలో గుణ తేజశ్వంత్ మృతదేహం



బైక్‌ను ఢీ కొట్టిన బెంజ్ లారీ



గుణ తేజశ్వంత్(ఫైల్)



చికిత్స పొందుతున్న యర్రంశెట్టి హర్షవర్ధన్

అనకాపల్లి : చేతికి అంది వస్తాడనుకున్న కుమారుడు గుణ తేజశ్వంత్ (17) రోడ్డు ప్రమాదంలో ఆదివారం మృత్యువాత పడడంతో ఆ కుటుంబ సభ్యులు భోరున విలపించారు. పట్టణంలో వేల్పులవీధికి చెందిన గుణ తేజశ్వంత్ విజయరామరాజుపేటకు చెందిన యర్రంశెట్టి హర్షవర్ధన్‌లు పట్టణంలో ప్రైవేట్ కళాశాలలో ఇంటర్ ద్వితీయ సంవత్సరం చదువుతున్నారు. గుణ తేజశ్వంత్ శనివారం యలమంచిలి మండలం పద్మనాభపేట గ్రామంలో ఓ శుభకార్యానికి తన తల్లి యశోదతో కలిసి వెళ్లారు. ఆదివారం ఉదయం అల్పాహారం తీసుకుని వారి ఇంటికి వచ్చారు. మధ్యాహ్నం భోజనం కోసం జాతీయ రహదారి ఉమ్మలాడ జంక్షన్ వద్ద హోటల్‌కు వెళ్లి బిరియాని తీసుకుని వస్తామని చెప్పి స్నేహితులైన విజయరామరాజుపేటకు చెందిన హర్షవర్ధన్, ధనుష్‌లతో కలిసి రెండు ద్విచక్రవాహనాలపై హోటల్‌కు వెళ్లారు. హర్షవర్ధన్ బైక్‌పై గుణ తేజశ్వంత్, హర్షవర్ధన్‌లు బయలు దేరారు. మరో బైక్‌పై ధనుష్ వెళ్లిపోయాడు. ముగ్గురూ ఉమ్మలాడ జంక్షన్ వద్ద హోటల్‌లో భోజనం చేసి, తల్లికి భోజనం పట్టుకుని తిరిగి ఇంటికి బయలు దేరారు. జంక్షన్ వద్ద జాతీయ రహదారి దాటుతున్న సమయంలో యలమంచిలి నుంచి విశాఖ వెళుతున్న బెంజ్ లారీ గుణ తేజశ్వంత్, హర్షవర్ధన్ బైక్‌ను వెనుక నుంచి ఢీకొట్టింది.

ఈ దుర్ఘటనలో తేజశ్వంత్ అక్కడిక్కడే మృతిచెందగా, హర్షవర్ధన్ తలకు తీవ్రగాయమైంది. స్థానికులు, ట్రాఫిక్ పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఎన్టీఆర్ ఆస్పత్రికి తరలించి, క్షతగాత్రుడు హర్షవర్ధన్‌కు ఎన్టీఆర్ ఆస్పత్రిలో చికిత్స చేయించి, మెరుగైన వైద్యం కోసం విశాఖ కేజీహెచ్‌కు తరలించారు. ఈ ఘటనపై మృతుడు తల్లి యశోద ఇచ్చిన ఫిర్యాదు మేరకు ట్రాఫిక్ ఎస్ఐ డి.శేఖరం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

అప్పన్నకు రెండు శఠగోపాల బహూకరణ

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి ఆదివారం హరేకృష్ణ మూవ్‌మెంట్ సుమారు రూ.10 లక్షలు విలువ చేసే రెండు బంగారు శఠగోపాలు(వెండిపై బంగారు పూత) బహూకరించింది. గ్లోబల్ హరేకృష్ణ మూవ్‌మెంట్ చైర్మన్ పద్మశ్రీ అవార్డు గ్రహీత మధుపండితదాస సింహగిరికి వచ్చి శఠగోపాలను ఆలయ ఏఈవో ఆనంద్‌కుమార్, ప్రధానార్చకుడు గొడవర్తి శ్రీనివాసాచార్యులకు అందజేశారు.

సంస్థ సభ్యులతో కలిసి స్వామి ఆరాధన కార్యక్రమంలో పాల్గొన్నారు. దేవస్థానం తరఫున అధికారులు మధుపండిత దాసకు, ఆయనతో వచ్చిన సంస్థ సభ్యులకు స్వామి దర్శనం కల్పించి ప్రసాదం, శేషవస్త్రాలను అందజేశారు.

ఏయూలో రాజకీయ క్రీడ

- పీహెచ్‌డీ స్కాలర్స్‌పై ఎందుకీ కక్ష
- పరీక్షల నిర్వహణకు చొరవ చూపని అధికారులు
- పరిశోధకులను ఇబ్బంది పెడుతోన్న ఓ వర్గం
- వర్సిటీ అధికారుల తీరుపై పెరుగుతోన్న అసంతృప్తి
- నేడు శాంతియుత ఆందోళన



ఆంధ్ర యూనివర్సిటీ

విశాఖ విద్య: ఖ్యాతిగడించిన ఆంధ్ర యూనివర్సిటీకి కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక రాజకీయ చెదలు పడుతున్నాయా..?. పీహెచ్‌డీ స్కాలర్స్ విషయంలో ప్రస్తుతం జరుగుతున్న పరిణామాలతో వర్సిటీ వర్గాలతో పాటు, విద్యావేత్తల్లోనూ ఇదే చర్చసాగుతోంది. వర్సిటీ పురోభివృద్ధి కోసమని గత వీసీ ప్రసాద్ రెడ్డి టీడీఆర్ హబ్ ఏర్పాటు చేయగా, దీన్ని నిర్వీర్యం చేయడమే లక్ష్యమన్నట్లుగా ప్రస్తుత పాలకులు తీసుకున్న నిర్ణయాలు విద్యార్థుల భవిష్యత్‌కు ప్రశ్నార్థకమౌతున్నాయి. పీహెచ్‌డీ స్కాలర్స్ విషయంలో వ్యవహరిస్తున్న తీరు దేశవ్యాప్తంగా చర్చసాగుతోంది. ఆంధ్ర యూనివర్సిటీలో కొంతమంది అవినీతి ఆచార్యులు తమ స్వలాభం కోసం వేస్తున్న ఎత్తుగడలకు పరిశోధక విద్యార్థులు బలిపశువులవుతున్నారు.

టీడీఆర్ హబ్ ద్వారా ప్రవేశాలు పొందిన పరిశోధక విద్యార్థులకు పరీక్షలను నిలిపివేస్తూ, వర్సిటీ అధికారులు ఇటీవల ఉత్తర్వులు జారీ చేశారు. 2019 నుంచి 2023 వరకు ఏయూ టీడీఆర్ హబ్ ద్వారా సుమారుగా 680 మంది పరిశోధక విద్యార్థులు ప్రవేశం పొందారు. ఎగ్జిక్యూటివ్ కమిటీ సిఫార్సుతో చేరిన కొద్ది మంది మిగతా వారంతా ఉన్నత విద్యామండలి నిర్వహించే ఏపీ ఆర్–సెట్ ద్వారా మెరిట్ ప్రాతిపదికన ఆంధ్ర యూనివర్సిటీలో చేరారు. వీరికి ఇప్పటికే ప్రీ పీహెచ్‌డీ, వైవా నిర్వహించాలి. వాటిని పూర్తి చేసిన వారికి అవార్డు ప్రదానం చేయాలి. కానీ, గత వీసీ ప్రసాద్ రెడ్డిపై రాజకీయ కక్షతో పరిశోధక విద్యార్థులకు పరీక్షలను సైతం నిలిపివేశారు.

అవినీతి ఆచార్యులతో అపఖ్యాతి

పీహెచ్‌డీ స్కాలర్స్ నుంచి పరీక్షల పేరిట డబ్బులు వసూలు చేసే అనవాయితీకి నాటి వీసీ ప్రసాదరెడ్డి బ్రేక్ వేశారు. దీన్ని జీర్ణించుకోలేని వర్సిటీలోని ఓ వర్గం కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక, పనిగట్టుకొని ఫిర్యాదులు చేయడంతో, ఆ ప్రభావం పరిశోధక విద్యార్థులపై పడింది. టీడీఆర్ హబ్ ద్వారా జరిగిన ప్రవేశాలపై వర్సిటీ ఉన్నత స్థాయి కమిటీ విచారణ జరిపి, 40 మంది పరిశోధకుల ప్రవేశాల విషయంలో లోపాలను ఎత్తి చూపినట్లు తెలిసింది. మిగతా వారంతా యూజీసీ నిబంధనలకు అనుగుణంగానే ప్రవేశాలు పొందారని తేల్చినా, పరీక్షలు జరగనివ్వకుండా వర్సిటీలోని కొంతమంది అవినీతి ఆచార్యులు అడ్డుపుల్లలు వేస్తున్నట్లు ప్రచారం జరుగుతోంది.

పరిశోధక విద్యార్థుల్లో పెరుగుతోన్న అసంతృప్తి

ఆంధ్ర యూనివర్సిటీకి ఉన్న క్రేజ్‌తో పీహెచ్‌డీ కోసమని చేరితే, అధికారులు ఇబ్బందులు గురి చేస్తుండటంపై వారిలో అసంతృప్తి పెరుగుతోంది. పరీక్షలు ఎందుకు నిలిపివేశారో చెప్పాలని డిమాండ్ చేస్తున్నారు. ఈ నేపథ్యంలోనే పరిశోధక విద్యార్థులతో 'జాయింట్ యాక్షన్ కమిటీ' ఏర్పాటైంది. పరీక్షలను వెంటనే నిర్వహించాలని కోరుతూ సోమవారం ఉదయం 10 గంటల నుంచి వర్సిటీ వైస్ చాన్సలర్ భవనం ముందు శాంతియుత నిరసన చేపడుతున్నట్లు ప్రకటించారు. ఆందోళనలో పాల్గొనేందుకు ఉభయ తెలుగు రాష్ట్రాల నుంచి పరిశోధక విద్యార్థులు ఇప్పటికే నగరానికి చేరుకున్నట్టు జేఏసీ ప్రతినిధులు తెలిపారు.